క్లుప్తంగా

సీఎం సాయం పంపిణీ



మాధురికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కేదారిశెట్టి మాధురికి సీఎం సహాయ నిధి రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం అందించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు సమక్షంలో లబ్ధిదారుకు కన్నబాబు చెక్కు అందజేసి, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. వైద్య నిమిత్తం ఆపదలో ఆదుకుని ఆర్థికసాయం అందించిన సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు, సర్పంచ్ సత్యనారాయణకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు



యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు, వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులో కొలువైన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వెంకటేశ్వర స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం, వేద పండితులతో కల్సి పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. సమీప గ్రామాల భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా స్వామివారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

విజ్ఞానదాయకంగా నేషనల్ ఫోరెన్సిక్ డే



విద్యార్థినికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న వైద్యులు

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో నేషనల్ ఫోరెన్సిక్ డే విజ్ఞానదాయకంగా జరిగింది. హెచ్ఓడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్ఎంసీ ఫోరెన్సిక్ డిపార్టుమెంట్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి బహుమతులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ ఫోరెన్సిక్ మెడిసిన్ ఆవశ్యకతను వివరించారు. ఫోరెన్సిక్ వైద్యంలో ఆధునిక విధానాలను వివరించారు.

నల్ల బ్యాడ్జీలతో 104 సిబ్బంది నిరసన

కరప: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. మండలం పెనుగుదురులో శుక్రవారం 104 ఉద్యోగుల సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.త్రిమూర్తులు, ఉపాధ్యక్షురాలు వి.ఇందుమతి, గ్రామ ఆశావర్కర్లతో కల్సి 104 వాహనం వద్ద నిరసన తెలిపి, అనంతరం విధులు నిర్వర్తించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: డీ1 సెక్షన్ 33/11 కేవీ ఆనందభారతి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ సినిమా రోడ్డు ఫీడర్‌పై వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆదివారం ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాద్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. సినిమారోడ్డు శేషబ్‌గల్లీ, పోలీస్‌లైన్, బ్యాంక్‌పేట, జయా రెసిడెన్సీ వీధి, శ్రీకాంప్లెక్స్ వీధి, కల్పన సెంటర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఈఈ తెలిపారు.

15న మండపేటలో ఐటీఐ అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మండపేట ఎస్‌వీపీఆర్ ఐటీఐలో 15వ తేదీన అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, లేదా ప్రైవేట్ ఐటీఐలో ఫిట్టర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 95738 92777 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

అప్రోచ్ అయ్యేదెలా సారూ..

- పంట ఉత్పత్తుల రవాణాకు అవస్థ
- హామీ ఇచ్చి మోసం చేశారని రైతుల ఆవేదన
- వంతెన నిర్మాణాన్ని అడ్డుకుంటామని ఆగ్రహం



అరట్లకట్టవద్ద కొవ్వూరి కాలువపై వేసిన తాత్కాలిక కాలిబాట

కరప: మండలం అరట్లకట్టలో అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కరప నుంచి అరట్లకట్ట మీదుగా ఇంద్రపాలెం వెళ్లే రహదారి ఆధునీకరణకు, దీంతో పాటు అరట్లకట్ట వద్ద కొవ్వూరు కెనాల్‌పై శిథిలమైన వంతెనను పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేశారు. దీంతో అరట్లకట్ట వంతెన పడగొట్టి, గతేడాది పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పంటకాలువపై తాత్కాలిక కాలిబాట వేశారు. కాగా అరట్లకట్ట రైతులకు చెందిన పంట భూములు సుమారు 600 ఎకరాలు కొవ్వూరు కాలువకు అవతల ఉంటాయి. కాలిబాట వంతెన వేసినప్పుడు రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆర్అండ్‌బీ అధికారులు, సదరు కాంట్రాక్టర్ రైతులకు అనుకూలంగా అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తామని మాట ఇచ్చారు. గతేడాది తొలకరి పంట, ఈ ఏడాది దాళ్వాపంట సమయాలు పూర్తయినా అప్రోచ్ నిర్మించలేదు. దీంతో రైతులు తమ పంటను తెచ్చుకోవాలంటే కైకవోలు, శహపురం మీదుగాను, మరో దారి ఇంద్రపాలెం, కొవ్వూరు గ్రామాల మీదుగా ఏడెనిమిది కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి వస్తోందని, దూరాభారంతో అదనపు ఖర్చుచేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడుగుతుంటే అప్రోచ్ రోడ్డు నిర్మిస్తామంటున్నారు తప్ప రెండు పంటలు పూర్తయినా నిర్మించలేదని రైతులు యరమాటి సతీష్, వెలుగుబంట్ల శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, అధికారులు స్పందించకపోతే వంతెన పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు.

రోడ్డు వెడల్పు లేక ఇబ్బంది

పంట కాలువపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పాత వంతెన పడగొట్టిన తర్వాత డైవర్షన్ రోడ్డు వెడల్పుగా వేయక పోవడం వల్ల రెండెడ్ల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లలేక చాలా ఇబ్బందిగా ఉంటోంది. రైతుల పొలాలన్నీ కాలువకు అవల వైపున ఉండడం వల్ల పంట ఉత్పత్తులు చుట్టూ తిరిగి తెచ్చుకోవాలంటే చాలా ఖర్చు అవుతోంది. రైతుల ఇబ్బందులను గమనించి, డైవర్షన్ రోడ్డు వెడల్పుగా వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.



– యరమాటి సతీష్, రైతు, అరట్లకట్ట

రెండు మూడు రోజుల్లో పరిష్కారం

కాలిబాట రోడ్డు ఇరుగ్గావేయడం వాస్తవమే. కాలువకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తికావొచ్చింది. రెండు, మూడు రోజుల్లో బండ్లు, ట్రాక్టర్లు వెళ్లేలా డైవర్షన్ రోడ్డు పూర్తిచేసి, ట్రాఫిక్ వెళ్లేలా చేస్తాం.

– టీవీఎస్ వర్మ, డీఈఈ

22 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కొంగోడులో డ్రెయిన్లపక్క పెరిగిపోయిన గడ్డిమొక్కలను శుభ్రం చేస్తున్న కార్మికులు

కరప: మండల పరిధి గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ఈ నెల 22వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. కరప, నడకుదురు, కూరాడ, వేములవాడ తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించి, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. శుక్ర, శనివారాల్లో సీసీ డ్రెయిన్లు, కచ్చా డ్రెయిన్లలో పూడికతీసి, శుభ్రపరచి, నీరునిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో డ్రెయిన్లలో యాంటీ లార్వా (దోమలమందు) పిచికారీ చేయించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలాలన్నారు. సాయంత్రం ఫాగింగ్ చేయించాలన్నారు. నీరు నిల్వ ఉన్న కుంటలలో గంబుజియా చేపలను వదలాలన్నారు. 18, 19 తేదీలలో గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకులు (ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు) అన్నీ శుభ్రంచేయించాలని, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో, వీధికుళాయిల వద్ద శుభ్రం చేయించి, డ్రైడే పాటించాలన్నారు. ఈ నెల 20, 22 తేదీల్లో గ్రామపంచాయతీల పరిధిలో రోడ్ల వెంబడి చెత్తకుప్పలు తొలగించి, శుభ్రంగా ఉంచాలని ఈఓపీఆర్డీ సూచించారు.

పర్యావరణహితంగా జీవిద్దాం



లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పర్యావరణహిత జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టు హాలులో శుక్రవారం లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)పై రెవెన్యూ, కాలుష్యం, మునిసిపల్, కార్మిక, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, దీనిని విజయవంతంగా అమలు చేసేందుకు వివిధ శాఖల సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఆరోగ్యకర, సుస్థిర జీవితం కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంధనం, జల వనరుల సంరక్షణ, ఈ-వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం వంటి వాటిపై ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఆర్వో, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎస్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపలో మేఘావృతమైన ఆకాశం

కరప: వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు శుక్రవారం సాయంత్రం మారిన వాతావరణంతో కాస్త ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వడగాడ్పులు వీచినా, సాయంత్రం మబ్బులు పట్టి ఈదురు గాలులు వీయడంతో పిల్లలు బయటకువచ్చి కేరింతలు కొట్టారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు



ఖాళీ స్థలాల్లో చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



ఇళ్లలో చెత్త సేకరణపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

- నగరంలోని ఖాళీ స్థలాల పరిశీలన
- నోటీస్ బోర్డులు పెట్టి జరిమానాలు వేస్తాం
- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్

కాకినాడ: ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మించడం లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పరిరక్షించు కోకపోతే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జగన్నాథపురం ప్రాంతంలోని ఖాళీ స్థలాలను పరిశీలించి స్థానికులు వాటిని డంపింగ్ యార్డులా వినియోగిస్తున్న విషయాన్ని గమనించారు. ప్రజారోగ్యానికి భంగకరంగా మారే ఇటువంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆయా స్థలాల యజమానులు తక్షణమే స్పందించకపోతే నోటీసులు ఇచ్చి, చట్టప్రకారం చర్యలు కూడా తీసుకుంటామన్నారు. స్పందించని యజమానుల స్థలాల్లో నోటీస్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని ఆయన నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. కాగా విద్యానగర్ ప్రాంతంలోని జంతు హింస నివారణ సంఘ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించారు. పశువుల సంరక్షణ కోసం అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ తదితరులు ఉన్నారు.

వర్షాలు పడేనాటికి పూడికలు తొలగించండి

కాకినాడ: వర్షాలు పడే లోపు పూడిక తీత పనులను పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన రేచర్లపేట రైల్వే డ్రైన్, రామకృష్ణారావుపేట ప్రాంతంలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు వస్తున్నారో లేదో ఆరా తీశారు. ఆయన వెంట ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అడపా సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హనుమాన్ జయంతి

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సత్య భాస్కర ప్రసన్నాంజనేయ స్వామి భజన మందిరంలో ఆదివారం ఉదయం పది గంటలకు హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తామని తెలిపారు.

ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌పై అవగాహన

కాకినాడ సిటీ: డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్‌కు 150 మంది డీసీసీబీ బ్యాంక్‌లో ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌కు ఎంపికైనట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వికాస కార్యాలయం బెన్నెట్ క్లబ్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వికాస ద్వారా ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులను ట్రైనింగ్‌కు పంపినట్లు తెలిపారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు ట్రైనింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంకు సీఈవో నరసింహారావు, వికాస మేనేజర్లు పాల్గొన్నారు.

పవన్ రాజకీయ నటుడు

- వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక



జమ్మలమడల నాగమణి

కాకినాడ రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ నటుడని, సినిమాల్లోనే కాదు రాజకీయాల్లోనూ బాగా నటిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల మహిళా విభాగం కోఆర్డినేటరు, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. కాకినాడలో శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకునేందుకు, పరిహారం ఇచ్చేందుకు అధికారులను అప్రమత్తం చేస్తే కేవలం రాజకీయం కోసం పవన్ రైతులు పేరిట నటిస్తున్నారని ఆక్షేపించారు. కాకినాడ రూరల్, సిటీలలో మత్స్యకారులకు ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. అన్ని వర్గాలు ప్రజలు ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని, పవన్ కేవలం రాజకీయం కోసం వారి సానుభూతి పొందలేరన్నారు. 2024లో సీఎంగా జగన్ రెండో సారి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని నాగమణి పేర్కొన్నారు.

నన్నయ వీసీ పద్మరాజుకు అభినందనలు



నన్నయ వీసీ పద్మరాజును అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ల బృందం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొప్పిరెడ్డి పద్మరాజు వర్సిటీ వీసీగా నియమితులవడంపై ఆయనను డైరెక్టర్ల బృందం అభినందించింది. వర్సిటీ ఆడిటోరియంలో అభినందన సభ ప్రత్యేకంగా ఏర్పాటుచేసి గతంలో ఏపీపీఎస్సీ సభ్యులుగా నియమ, నిబద్ధతలతో సేవలందించారని, అదే స్ఫూర్తితో వర్సిటీకు సేవలు అందించాలన్నారు. అంతకు ముందు న్యాక్ బృందం పర్యటన విజయవంతం కావడంపై అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపి, ఈ నెల 31వ నిర్వహించే 9వ స్నాతకోత్సవం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- 108కి ఫోన్‌చేసి క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించిన ఎమ్మెల్యే కన్నబాబు



ప్రమాద స్థలం నుంచి 108కి ఫోన్ చేసి, దగ్గరుండి సపర్యలు చేయిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండలం వేళంగి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలమేరకు కాజులూరు మండలం చేదువాడ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి వేళంగిలో పని ముగించుకుని, తిరిగి ఇంటికి వెళుతుండగా వేళంగి సిరిగలపల్లంక రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం రాశిని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో ఆ మార్గం నుంచి ఓ వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆ ప్రమాదాన్ని చూసి 108కి ఫోన్ చేసి క్షతగాత్రుడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి, వైద్యం చేయించాలని అక్కడ ఉన్న కరప ఎస్ఐ రామకృష్ణను ఆదేశించారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



జీజీహెచ్‌లోని పీడియాట్రిక్స్ విభాగంలో కేక్ కట్ చేస్తున్న నర్సులు



కరప పీహెచ్‌సీలో సత్కారం పొందిన సీనియర్ స్టాఫ్‌నర్స్, నర్సులతో డాక్టర్ శ్రీనివాస్‌నాయక్



ఏపీఐఐసీ కాలనీలో ఏఎన్ఎంలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇటలీకి చెందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నివాళులు అర్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టరు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, డాక్టరు దీప్తి తదితరులు పాల్గొని పండూరు పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్ఎంలకు దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆస్పత్రిలో నర్సులను సన్మానించి కేక్ కట్ చేశారు. ఆస్పత్రి డైరెక్టరు డాక్టర్ రామకృష్ణ నర్సుల సేవలు వెలకట్టలేనివన్నారు.

కరప పీహెచ్‌సీలో..

కరప: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ నర్సింగ్ డే సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, పీహెచ్‌సీ సిబ్బందితో కలసి నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని సిబ్బంది మరింతగా ప్రజలకు వైద్యసేవలందించాలన్నారు. వరల్డ్ నర్సింగ్ డేను పురస్కరించుకుని సీనియర్ సీహెచ్ఓ వై.రత్నకుమారిని, హెచ్‌వీలు సత్యనారాయణమ్మ, మస్తాన్‌బీ, సీనియర్ స్టాఫ్‌నర్స్ లక్ష్మి, మహాలక్ష్మి, కనకదుర్గలను పీహెచ్‌సీ సిబ్బందితో కలసి ఆయన సత్కరించారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. పీడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న నర్సులకు నెస్లే, సెరెలాక్ సంస్థల ప్రతినిధులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. డీసీఎస్ఆర్ఎంఓ డాక్టర్ అనిత, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు వైద్య సిబ్బంది, నర్సులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, స్టేట్ బ్యాంకు బృందం జీజీహెచ్ నర్సులకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా అభినందనలు తెలిపారు. అంతకు ముందు జీజీహెచ్ ఆవరణలో ఉన్న ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి నర్సింగ్ అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు.

సీబీఎస్ఈలో కేంద్రీయ విద్యాలయం శతశాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్: మండలం వలసపాకలలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తాచాటారు. 48 మంది విద్యార్థులు పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ బొంత శేఖర్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు.

ముందస్తు నాట్లకు సిద్ధంకండి

- ఏడీఏ ధైవకుమార్

పెద్దాపురం: పంటకాలంలో రైతులు ముందస్తుగా నాట్లు వేసుకోవాలని ఏడీఏ ధైవకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో సన్న రకాలను సాగులోకి తీసుకువచ్చేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మండలి సభ్యులు యిన కొండ వీర విష్ణుచక్రం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో జరిగిన లోటుపాట్లను అధిగమించి ఉన్నత సేవలందించాలన్నారు. పశువైద్యాధికారి రాకేష్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి దృష్ట్యా పశువులను నీడలో ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్రం చల్లటి నీటితో శుభ్రపరచాలన్నారు. సమీకృత దాణాపై అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి ఎన్.సుజాత, ఏఈఓ ప్రసాద్, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలను అధిగమించాలి

సామర్లకోట: మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో సాంకేతిక సమస్యలను శిక్షణతో అధిగమించాలని జిల్లా రిసోర్సు పర్సన్ దాసరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో మెప్మాలోని పెద్దాపురం మున్సిపాలిటీ రీసోర్సు పర్సన్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ప్రతి మహిళా సంఘం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా చేయాలన్నారు. మహిళా సంఘాలకు చెందిన వివరాలను ఆన్‌లైన్ చేసే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను శిక్షణతో దూరం అవుతాయని తెలిపారు. మెప్మా డీపీఎంలు అనంత్, కె.మోహన్‌కుమార్ శిక్షణ ఇచ్చారు.